క్లుప్తంగా

తొలి ఉద్యమ నాయకుడు ఉయ్యాలవాడ



ఉయ్యాలవాడకు నివాళులు అర్పిస్తున్న రెడ్డి సంక్షేమ సంఘ సభ్యులు

బోట్‌క్లబ్: ఆంగ్లేయులపై తొలి స్వాతంత్య్ర ఉద్యమం చేసింది ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని కాకినాడ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు బస అంజనేయరెడ్డి అన్నారు. కాకినాడలోని రెడ్డి సంక్షేమ సంఘ కార్యాలయంలో గురువారం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని నిర్వహించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంతో సెక్రటరీ కిలుము బాలాజీ రెడ్డి, చాట్ల రాజారెడ్డి, బోర పెద్దా, సంఘ సభ్యులు, మాజీ కార్పొరేటర్లు రోకళ్ల సత్యనారాయణ రెడ్డి, గుజ్జు దుర్గాలక్ష్మణరెడ్డి పాల్గొని నివాళులు అర్పించారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్లు సత్వరం పూర్తి చేయండి

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): నవరత్నాలు పథకంలో ఇల్లు నిర్మించుకున్న వారికి ఇంటి రిజిస్ట్రేషన్లు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని జిల్లా గృహనిర్మాణశాఖ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ అన్నారు. జిల్లాలోని తహసీల్దార్లు, హౌసింగ్ ఈఈ, డీఈ, ఏఈలతో గురువారం ఆయన సమీక్షించారు. తహసీల్దార్లు సైట్‌లో లాగిన్ అయ్యి 850 లబ్ధిదారులకు వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. అనంతరం పేదలందరికీ ఇళ్లు, పీఎంఏవై ప్రగతిపై సమీక్షించి ఏఈలకు తగిన ఆదేశాలిచ్చారు. ఇల్లు మంజూరైన అందరితో వెంటనే బ్యాంకు ఖాతాలు తెరవాలన్నారు. స్వచ్ఛ భారత్ నిధులతో నిర్మాణంలో ఉన్న 5300 మరుగుదొడ్లు త్వరగా పూర్తి చేయాలన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ ర్యాలీ

బాలాజీచెరువు: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గురువారం స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పీఆర్ ఉన్నత పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ కమిషనర్ ఆర్‌జేడీ రాజు ర్యాలీ ప్రారంభించారు. ముందుగా సర్వమత ప్రార్థనలు నిర్వహించి స్కౌట్ ప్రతిజ్ఞ విద్యార్థులచే చేయించారు. పాఠశాల అవరణ నుంచి బాలాజీచెరువు, మెయిన్ రోడ్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ పరిషాద్‌బేగం, అసిస్టెంట్ కార్యదర్శి వి.మాచరావు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కాకినాడ: విద్యుత్ వార్షిక మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు డి–2 సెక్షన్ పరిధిలో పలు చోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో డీఈ జి.ప్రసాద్ తెలిపారు. ఫీడర్ పరిధిలోని పర్లోపేట, సంజయ్‌నగర్, రాజీవ్ గృహకల్ప అపార్ట్‌మెంట్స్, వార్ఫు రోడ్డు, బుడంపేట, సూర్యనారాయణపురం, తిలక్ వీధి, రంగయ్యానాయుడు వీధి, పాత పోర్టు రైల్వే స్టేషన్, ఏటిమొగ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

అలాగే శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జగన్నాథపురంలో, మధ్యాహ్నం 3 నుంచి 5.30 గంటల వరకు మరికొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఉదయం ముత్తానగర్, గోళీలపేట, వలందపేట, తుఫాన్‌బిల్డింగ్, పోర్టుకాలనీ, జె.రామారావుపేట, చిన్నమార్కెట్ ఏసువారివీధి, పాత జగన్నాథపురం వంతెన, మున్సిఫ్ జంక్షన్, ఎంఎస్‌ఎన్ చార్టీస్, చర్చి స్క్వేర్, పురంవారివీధి, డ్రైవర్స్‌కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి నరసింహారోడ్డు శివాలయం వీధి, తారకామానగర్, ఘాటీసెంటర్, కొవ్వూరు రోడ్డు, సుందర నగర్, పప్పుల మిల్లు ఏరియా, రిక్షాలపేట, పరదేశమ్మపేట, ప్రసాదరావునగర్, సత్యదేవినగర్‌లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

కరప: చేసిన అప్పులు తీర్చలేమన్న మనస్తాపంతో ఒక వృద్ధుడు పురుగుల మంది తాగి ఆత్మహత్యకు పాల్పడగా, కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందాడు. స్థానిక పోలీసులు తెలిపిన కథనం మేరకు మండలం గురజనాపల్లి గ్రామానికి చెందిన పువ్వల నాగయ్య (67) అదేగ్రామంలో 7 ఎకరాలు కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నారు. పెట్టుబడి కోసం రూ.2 లక్షలు అప్పుచేశాడు. వ్యవసాయంలో నష్టం రావడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మానసికంగా కుంగిపోయాడు. ఈ నెల 21వ తేదీన మానసిక ఒత్తిడిని తట్టుకోలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని నాగయ్య భార్య శ్రీనాగదేవి కాకినాడలో ఉంటున్న తమ కుమారుడు పువ్వల కృష్ణకు తెలిపింది. కృష్ణ హుటాహుటిన వచ్చి అపస్మారక స్థితిలో ఉన్న తండ్రి నాగయ్యను చికిత్స కోసం 108లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుడి కుమారుడు కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కరప పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై ఎన్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారును ఢీకొన్న ఆటో

సామర్లకోట: కాకినాడ రోడ్డులో కారును ఆటో ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం కాకినాడ నుంచి వస్తున్న కారు రోడ్డు మార్జిన్‌లో ఉన్న పండ్ల దుకాణం వద్ద ఆగింది. వెనుక నుంచి వస్తున్న ఆటో ఆ కారును ఢీకొంది. దీంతో ఆటో డ్రైవరు సునీల్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఆటో డ్రైవర్‌ను కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

జగనన్న నమ్మకాన్ని నిలబెట్టారు

- వలంటీర్లు సీఎం సైన్యం
- సేవా పురస్కారాల సభలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు



సేవావజ్ర పురస్కార గ్రహీత పార్వతిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: ప్రభుత్వ పాలనను ప్రజలచెంతకు తీసుకు వెళ్లడమే కాకుండా, సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలుచేస్తున్న గ్రామ వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి, అసమాన్యమైనవని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నమ్మకాన్ని వమ్ముచేయకుండా బాధ్యతగా పనిచేస్తున్న వలంటీర్లకు సీఎం తరపున, మండల ప్రజల తరపున వందనమని ఎమ్మెల్యే తెలిపారు. మీరు వలంటీర్లు కాదు సీఎం జగన్ సేన, సైన్యం అన్నారు. స్థానిక చిరంజీవి కళ్యాణమండపంలో గురువారం ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన సత్కారసభలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్షాలు వలంటీర్లపై చేస్తున్న ఆరోపణలు తిప్పికొట్టాలని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపొందేలా ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. వలంటీర్ల వ్యవస్థను తీసే సాహసం ఏ పార్టీ చేయదని తెలిపి, ఎప్పుడు ఎవరికి ఏకష్టం వచ్చినా అండగా ఉంటామని ఎమ్మెల్యే కన్నబాబు భరోసా ఇచ్చారు. ఈ వ్యవస్థను తీసుకువచ్చిన సీఎం జగన్‌కు వలంటీర్లను ఎలా ఆదుకోవాలో తెలుసని, భవిష్యత్‌తో గౌరవం వచ్చేలా, గౌరవవేతనం కూడా పెంచుతారని ఎమ్మెల్యే ప్రకటించారు. రెండు నెలల్లో ఎన్నికలు రాబోతున్నాయని, పేదల పక్షాన పోరాడుతున్న సీఎం జగన్‌కు అండగా నిలవాలని, నియోజకవర్గంలో తనను ఎమ్మెల్యేగా గెలిపించేందుకు తద్వారా జగన్‌ను మళ్లీ సీఎంగా చేసేందుకు సైన్యంలా పనిచేసి, ముఖ్యమంత్రి నమ్మకాన్ని మరోసారి నిలబెట్టాలన్నారు. నియోజకవర్గంలో 32 వేల మందికి ఇళ్ల పట్టాలిచ్చామని, మరో 7 వేల మందికి ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇన్ని చేస్తున్న ప్రభుత్వాన్ని, నాయకత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఈ సందర్భంగా సేవావజ్రకు ఎంపికై న నున్న బోయిన పార్వతి, ముమ్మిడి రజినిలకు రూ.45 వేలు, సేవారత్నకు ఎంపికైన పులుగుల చినతాతారావు, మీసాల కనకమహాలక్ష్మి, ఇనకోటి చంద్రకళ, రెడ్డి జ్యోతిమణి, కర్రి గాయత్రిలకు రూ.30 వేలు వంతున, 494 మందికి సేవామిత్రలకు రూ.15 వేలు వంతున అందచేసి సత్కరించారు.

అంతకు ముందు కరప హైస్కూలులో పీఎంశ్రీ పథకంలో రూ.15.5 లక్షలతో నిర్మించే కెమిస్ట్రీ ల్యాబ్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కన్నబాబు భూమిపూజ చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచ్ సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, రాష్ట్ర బాలల హక్కుకమిషన్ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరావు, జిల్లా సభ్యుడు బొండా చంటిబాబు, రాష్ట్ర పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డిపల్లి రమేష్, మండలయూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



కరప హైస్కూలులో ల్యాబ్ భవన నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

సామాజిక భవనం ప్రారంభోత్సవం



సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: మండలంలోని తమ్మవరం గ్రామంలో చేనేత కార్మికుల సంక్షేమానికి రూ.60 లక్షలతో నిర్మించిన సామాజిక భవనాన్ని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు గురువారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులు అధికంగా ఉండే తమ్మవరంలో వారి అభ్యర్థన మేరకు సామాజిక భవనం నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతన్న నేస్తం ద్వారా చేనేత కార్మికులను ఆదుకుంటున్నారని, నియోజకవర్గంలో అన్ని వర్గాలవారికి సముచిత స్థానం ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ గొల్లపల్లి రాంబాబు, గొల్లపల్లి దొరబాబు, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ గగారిన్, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు గొల్లపల్లి సత్తిరాజు, పండూరు ఉపసర్పంచ్ వలవల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొమరగిరి ప్రగతిని చూసొద్దాం రండి

- రోజూ 2500 మంది సందర్శనకు ఏర్పాట్లు
- 24 నుంచి బస్సులలో సైట్ విజిట్
- సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి వెల్లడి



కొమరగిరిలో అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకంలో ఇక్కడి లబ్ధిదారులకు కేటాయించిన స్థలాలు, ఇళ్ల నిర్మాణ ప్రగతిని చూపించేందుకు ఈ నెల 24వ తేదీ నుంచి సిటీ నియోజకవర్గ లబ్ధిదారులను బస్సులలో తీసుకువెళ్లి అక్కడి ప్రగతిని చూపించనున్నట్టు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చెప్పారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై గృహ నిర్మాణశాఖ అధికారులతో కలిసి కొమరగిరిని ఎమ్మెల్యే ద్వారంపూడి సందర్శించారు. ఆ వివరాలను గురువారం సాయంత్రం విలేకర్లకు వివరించారు. సిటీ పరిధిలో దాదాపు 30 వేల మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశామన్నారు. వీరిలో ఎక్కువశాతం కొమరగిరిలో కేటాయించామని, అక్కడ ఇళ్ల నిర్మాణం కూడా జరుగుతోందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇక్కడి లబ్ధిదారులందరికీ పట్టాలు ఇచ్చారన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో తిరిగి అధికారాన్ని చేపట్టాక 18 నెలల వ్యవధిలో 30 వేల ఇళ్లను పూర్తి చేసి చూపిస్తానన్నారు. ఆయా స్థలాలను, అక్కడ కల్పిస్తున్న మౌలిక వసతులను చూపించేందుకు ఈ నెల 24న తొలుత జగన్నాథపురం ప్రాంత లబ్ధిదారులను అక్కడకు తీసుకువెళ్తామన్నారు. ఆ తరువాత మిగిలిన డివిజన్ల లబ్ధిదారులు కూడా కొమరగిరి సందర్శించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రోజుకి 2,500 మంది చొప్పున సైట్‌విజిట్‌కు వెళేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సుమారు 12 రోజుల పాటు పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమం కొనసాగుతుందని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో ఆయన వెంట హౌసింగ్ డీఈ సత్యనారాయణరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, మాజీ కార్పొరేటర్లు జేడీ పవన్‌కుమార్, కంపర బాబి, యువ నాయకులు మల్లిపాముల గణపతి, కాంట్రాక్టర్ గద్దేపల్లి దాసు తదితరులు ఉన్నారు.

విద్యాభివృద్ధికి రోటరీ కృషి

బోట్‌క్లబ్: విద్యాభివృద్ధికి రోటరీక్లబ్ ఎనలేని కృషి చేస్తోందని రోటరీ గోల్డెన్‌జూబ్లీ క్లబ్ అధ్యక్షులు నరహరిశెట్టి రవికృష్ణ అన్నారు. ఇనోదయ హాస్పిటల్ సౌజన్యంతో ఐదుగురు అనాథ పిల్లలకు గురువారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో సైకిళ్లు అందజేశారు. అలాగే గురజనాపల్లిలోని అంధుల హాస్టల్‌కు పరుపులు అందించారు. ఈ సందర్భంగా రవికృష్ణ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి రోటరీ అనేక ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుందన్నారు. నిరుపేద విద్యార్థులకు పుస్తకాలు, వారికి కావాలసిన మౌలిక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. అనంతరం ఇనోదయ ఎండీ గొడవర్తి రామ్మోహన్, సీఈఓ లావణ్య సైకిళ్లు, పరుపులు అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ చందు, ట్రెజరర్ పవన్, రోటరీ వృద్ధాశ్రమం చైర్మన్ ధనసాగర్ ప్రసాద్, రోటరీ బ్లడ్‌బ్యాంక్ సెక్రటరీ వర్మ పాల్గొన్నారు.



అనాథ విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్న రోటరీ సభ్యులు

ఘనంగా అలుగుల సంబరం

కరప: మండలం గొర్రిపూడి గ్రామంలో గురువారం అలుగుల సంబరం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని కరికాల భక్తులు ఈ సంబరాన్ని ఐదు దశాబ్దాలుగా చేస్తున్నారు. యేటా భీష్మ ఏకాదశి రోజున బసవేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం నిర్వంచి, ఐదు రోజుల పాటు వివిధ రకాల పూజలు చేసి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మూడో రోజు కరికాల భక్తులు గోదావరి పాయ ప్రవహించే కేఎంజే కాలువలో స్నానమాచరించి, శూలాలను బుగ్గలకు గుచ్చుకుని ఊరేగారు. శనివారం రాత్రి ఆలయంలో పార్వతీ పరమేశ్వరుల సంబరం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. అదే రోజు సాయంత్రం భక్తులు నిప్పుల గుండం తొక్కడం పరిపాటి. సంతానం లేనివారు నందిని ఎత్తుకుని నిప్పుల గుండం తొక్కితే సంతానం కలుగుతుందని గ్రామస్తుల విశ్వాసం. ఆలయ ధర్మకర్త చప్పిడి నవీన్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



గొర్రిపూడి బసవేశ్వరస్వామి ఆలయంలో బుగ్గలకు అలుగులు గుచ్చుకున్న భక్తులు

గాంధీభవన్ నిర్వహణ భేష్

బోట్‌క్లబ్: గాంధీభవన్ నిర్వహణ చాలా బాగుందని స్వాతంత్రోద్యమ చరిత్ర పరిశోధకుడు, మహావీర్ త్యాగి మనువడు ఏఎస్‌బిఎల్ నౌరియా అన్నారు. గురువారం ఆయన గాంధీభవన్‌ను సందర్శించి, గాంధీ విగ్రహానికి నూలు దండలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్ర ఉద్యమ పోరాట సమయంలో కాకినాడ యోధులు పోషించిన పాత్ర మరువలేనిదన్నారు. 1923 కాంగ్రెస్ మహాసభలు ఉద్యమానికి గొప్ప దిశానిర్దేశం చేశాయన్నారు. మహాత్మా గాంధీ 1921లో కాకినాడ వచ్చినప్పుడు అద్భుతమైన ప్రజాస్పందన వచ్చిందన్నారు. ఎంతో చారిత్రక నేపథ్యం ఉన్న ఈ పట్టణానికి మళ్లీ వస్తానని, కాంగ్రెస్ మహాసభలపై తానొక డాక్యుమెంటరీ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. నౌరియాకు గాంధీభవన్ కార్యదర్శి వక్కలంక రామకృష్ణ గాంధీనగర్ పార్కు, టౌన్ హాల్ లైబ్రరీ, టౌన్ హాల్ ప్రాంగణంతో పాటు పలు చారిత్రక ప్రదేశాలను చూపారు. ఈ కార్యక్రమంలో గాంధీభవన్ కార్యవర్గ సభ్యులు రామారావు, వాసా సత్యనారాయణమూర్తి, అల్లూరు సురేంద్ర, పావని పాల్గొన్నారు.



గాంధీభవన్‌లో గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న మహావీర్ త్యాగి మనవడు నౌరియా

అరుణాచలం యాత్రకు ప్రత్యేక బస్సులు

ప్రారంభించిన డీపీటీవో శ్రీనివాసరావు

కాకినాడ: కాకినాడ నుంచి అరుణాచలం యాత్ర వెళ్ళే ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన రెండు సూపర్‌లగ్జరీ ప్రత్యేక బస్సులను జిల్లా ప్రజారవాణాధికారి ఎం.శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. మూడు రోజులు యాత్రలో ఐదు క్షేత్రాలను చూపించి ఈ నెల 25వ తేదీన ఈ బస్సులు తిరిగి కాకినాడ చేరుకుంటాయని డీపీటీవో చెప్పారు. కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, కంచి క్షేత్రాలను చూపిస్తామన్నారు. ఈ యాత్రకు ఒక్కక్క ప్రయాణికుడు రూ. 3,100లు చొప్పున టిక్కెట్ ధరగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎంయువీ మనోహర్, అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



బస్సును ప్రారంభిస్తున్న డీపీటీవో శ్రీనివాసరావు

జీజీహెచ్ మెకానిక్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

తక్షణ విచారణకు ఆదేశాలు

కాకినాడ క్రైం: జీజీహెచ్‌లో విధులు నిర్వర్తిస్తున్న గ్రేడ్–2 మెకానిక్ కిల్లారి సురేంద్ర రాజుపై కలెక్టర్, విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు విచారణ చేపట్టాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్‌ను గురువారం లిఖితపూర్వకంగా ఆదేశాలు అందాయి. కాకినాడ జీజీహెచ్‌లో ఎంఎన్‌వోగా పనిచేసిన పాత్రుడు అనే మాజీ ఉద్యోగి కుమారుడే సురేంద్ర. విధి నిర్వహణలో అనారోగ్యానికి గురయ్యానంటూ తప్పుడు పత్రాలు సృష్టించి తన కుమారుడు సురేంద్రకు కారుణ్య నియామకంలో ఉద్యోగం వచ్చేలా చేశాడని, మెడికల్ ఇన్‌వాలిడేషన్‌లో అవకతవకలకు పాల్పడ్డాడనీ ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రస్తుతం సురేంద్ర కొనసాగుతున్న ఉద్యోగం చెల్లదని ఈ విషయంపై తగిన విచారణ చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. అలాగే అతడు పనిచేస్తున్న వర్క్‌షాప్‌లో పాత ఉపకరణాల నిర్వహణలో అవినీతికి పాల్పడ్డాడని ఫిర్యాదులో ప్రస్తావించారు. విచారించి తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన కలెక్టర్ విచారణకు తక్షణ ఆదేశాలు జారీ చేశారని జీజీహెచ్ ఆర్‌ఎంవో డాక్టర్ రాహుల్ తెలిపారు. శుక్రవారం సూపరింటెండెంట్ డాక్టర్ విఠల్ ఆధ్వర్యంలో విచారణ బృందం ఏర్పాటు కానుందనీ, ఇరు అంశాలపైనా ఈ బృందం లోతైన విచారణ చేపట్టి నివేదిక సమర్పించనుందని తెలిపారు.

డయల్ యువర్ ఆర్టీసీ డీఎంకు వినతులు

కాకినాడ: ప్రయాణికుల సూచనలు, సలహాలను స్వీకరణతో పాటు, పరిష్కారాలకు గురువారం డయల్ యువర్ ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎం ఎంయూవీ మనోహర్ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వినతులను ఫోన్ ద్వారా స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు ప్రయాణికులు మల్లవరం నుంచి కాకినాడకు బస్సు సౌకర్యం కల్పించాలని, కాకినాడ నుంచి రావులపాలెం వెళ్లేందుకు రాత్రి 9.30 నుంచి పల్లెవెలుగు బస్సు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పిఠాపురం–సామర్లకోట బస్సులు పిఠాపురం బస్టాండ్ వరకు నడపాలని, సామర్లకోట–ఉండూరు క్రాస్‌రోడ్ వద్ద బస్సులకు రిక్వెస్ట్‌స్టాప్‌లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ధర్మవరం గ్రామంలో బస్సు సమయ వేళలు తెలియజేసేలా బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. కాకినాడ, కూరాడ బస్సుతో పాటు, చిత్రాడ గ్రామంలో ఎస్సీ పేట అంబేద్కర్ విగ్రహం వద్ద బస్సులు నిలపాలని విజ్ఞప్తి చేశారు. ఆయా అంశాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని డీఎం మనోహర్ తెలిపారు.

ఆడుదాం-ఆంధ్రా రాష్ట్ర పోటీల్లో ప్రతిభ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): రాష్ట్ర ప్రభుత్వం విశాఖలో నిర్వహించిన ఆడుదాం- ఆంధ్రా రాష్ట్రస్థాయిం పోటీల ఖో–ఖో బాలికల విభాగంలో ప్రగతి ఇంటర్మీడియట్ విద్యార్థులు ప్రతిభ చూపారు. విద్యార్థుల బృందం సంగన ఐశ్వర్య, అరనపల్లి మౌనిక, సీహెచ్ దీపిక, గొంప పావని బృందం జిల్లా స్థాయిలో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీల్లో తృతీయ స్థానం సాధించారు. ఈ బృందం రూ.2 లక్షల నగదు ప్రోత్సాహంతో పాటు కాంస్య పతకాలు, ట్రోఫీ సాధించారు. విద్యార్థుల బృందాన్ని ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ ఎన్.పూర్ణచంద్రరావు గురువారం అభినందించారు. సీఎం జగన్ విద్యతో పాటు సమానంగా క్రీడలను ప్రొత్సహించాలని గ్రామీణ స్థాయి నుంచి క్రీడలను పెంపొందించాలనే ఉద్దేశ్యంతో ఈ పోటీలు నిర్వహించి వారిలో ప్రతిభను వెలికి తీశారన్నారు. ఏజీఎం అనిల్‌బాబు, సీఇవో సదాశివరావు, అధ్యాపక బృందం క్రీడాకారులను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న సీఈఓ సదాశివరావు

ఆన్‌లైన్‌లో కొలువు కబురు

- ఉపాధి కార్యాలయంలో పడిగాపులు అవసరం లేదు
- నమోదుతో అర్హతను బట్టి ఇంటికే ఆఫర్ లెటర్
- వెబ్‌సైట్‌లోనే ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఖాళీల వివరాలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ శాఖకు ప్రభుత్వం డిజిటల్ హంగులు అద్దింది. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు మరింత చేరువ చేయడానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజి, ట్రైనింగ్ శాఖ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ వెబ్ పోర్టల్ గత నెల 8వ తేదీన విజయవాడలో ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ప్రారంభించారు. రాష్ట్రంలో ప్రైవేట్ కంపెనీల ఉద్యోగ వివరాలు, ప్రభుత్వ శాఖల్లో జారీచేసిన నోటిఫికేషన్ల వివరాలు పొందుపరిచారు. నిరుద్యోగ యువత వారి విద్యార్హతలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆ మేరకు ఏ ఉద్యోగాలకు వారు అర్హులో వారి మొబైల్ నెంబర్‌తో పాటు రిజిస్టర్ ఇ–మెయిల్ ఐడీకు సమాచారం అందుతుంది. ప్రైవేట్ కంపెనీల్లో ఖాళీలు భర్తీ చేయడానికి ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాల సమాచారం, ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాల ఖాళీల భర్తీకు జారీ చేసే నోటిఫికేషన్ల సమాచారం ఈ వెబ్‌సైట్‌లో ఎప్పటికప్పుడు నవీకరిస్తారు.

వెబ్‌పోర్టల్ లాగిన్ ఇలా..

- ఇంటర్‌నెట్‌లో డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎంప్లాయిమెంట్.ఏపీ.జీవోవీ.ఇన్‌లో జాబ్‌సీకర్‌లో వారి ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ ద్వారా లాగిన్ అవ్వాలి.
- వారి విద్యార్హతలు, వివరాలు నమోదు చేసిన వెంటనే వారి మొబైల్‌కు సమాచారం వస్తుంది. వివరాలు నమోదు చేసిన వెంటనే సంబంధిత జిల్లా ఉపాధి కార్యాలయానికి ఆ వివరాలు చేరతాయి.

ఎంప్లాయిమెంట్ శాఖ కార్యాలయంలో సిబ్బంది ఎప్పటికప్పుడు వాటిని పరిశీలించి అన్ని సక్రమంగా ఉంటే రిజిస్ట్రేషన్ నంబరును అభ్యర్థికి పంపుతారు.

- ఏమైనా వివరాలు తప్పుగా ఉంటే, ఇంకా సమాచారం కావాలన్నా ఉపాధి కార్యాలయ సిబ్బంది ఫోన్ ద్వారా వివరాలు అడుగుతారు.



నమోదు వివరాలు ఇలా..

అర్హత	నమోదులు
పదవ తరగతిలోపు..	490
పదవ తరగతి	5910
ఇంటర్మీడియట్	6840
డిగ్రీ	6490
డిప్లమో	3418
ఇతర విద్యార్హతలు	16,570

యువతకు ఎంతో ఉపయోగం



ఈ వెబ్‌పోర్టల్‌తో యువతకు ఎంతో ఉపయోగం ఉంది. విద్యకు తగ్గ ఉపాధి కల్పించే దిశగా కృషిచేస్తున్నాం. ప్రతి నెలా రెండు జాబ్‌మేళాలు నిర్వహించి విద్యకు తగ్గ ఉపాధి కల్పిస్తున్నాం. అర్హత గల ప్రతి యువతీ యువకులు రిజిస్ట్రేషన్ చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం.

– జి.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి

- ఎంప్లాయిమెంట్ శాఖ కార్యాలయంలో నిర్వహించే విద్యార్హత పత్రాల రిజిస్ట్రేషన్, రెన్యువల్ అదనపు విద్యార్హతల నమోదు వంటి సేవలు ఈ వెబ్ పోర్టల్‌లో అందుబాటులోకి వచ్చాయి.
- ఈ వెబ్ పోర్టల్ రిజిస్ట్రేషన్ చేసుకుంటే కేవలం రెండు రోజుల్లో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ కార్డు అందుతుంది.
- ఏ విద్యార్హత లేనివారు సైతం వారికి ఏ విద్య, వృత్తి వచ్చో ఆ వివరాలు నమోదు చేసుకోవచ్చు. వారి విద్యతో సంబంధం లేకుండా నచ్చిన ఉపాధి కల్పిస్తారు.

ప్రతి విద్యార్థికి డిజిటల్ కార్డు: ఉపాధి కల్పనశాఖలో ఇప్పటి వరకూ వివరాలు నమోదు చేసుకున్న వారికి గుర్తింపు సంఖ్యతో పాటు ధ్రువపత్రం ఇచ్చేవారు. ఇకపై ఎంసీసీ (మోడల్ కెరియర్ సెంటర్) విధానంలో కార్డుల జారీ ఉంటుంది.